మైనార్టీ ఓట్లు కాంగ్రెస్‌కే..

- కూకట్‌పల్లి నియోజకవర్గంలో బలాన్ని పెంచుకున్న కాంగ్రెస్
- అసెంబ్లీ ఎన్నికల్లో 65వేల ఓట్లు.. లోక్‌సభ ఎన్నికల్లో 87వేల ఓట్లు
- పెరిగిన 22వేల ఓట్లు మైనార్టీలవేనని చెబుతున్న పరిశీలకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 65వేల ఓట్లు సాధించింది. లోకసభ ఎన్నికల్లో 87వేల ఓట్లను తెచ్చుకుని అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. 20వేలకు పైగా ఓట్లు రావడానికి ముఖ్యకారణం మైనార్టీ ఓట్లేనని ఫలితాలను బట్టి తెలుస్తోంది. నియోజకవర్గంలోని బోయినపల్లి, అల్లాపూర్ ప్రాంతంలో ఉండే మైనార్టీల ఓట్లు కాంగ్రెస్‌కే వచ్చినట్లు సమాచారం.

రౌండ్‌ల వారీగా పడిన ఓట్ల తీరు..

- 6వ రౌండ్‌లో 12765 ఓట్లు ఉండగా బీజేపీకి 4138 ఓట్లు, కాంగ్రెస్‌కు 6907 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్‌కు మాత్రం 1546 ఓట్లు మాత్రమే వచ్చాయి.
- 13వ రౌండ్‌లో 14322 ఓట్లు పోలయ్యాయి. అందులో బీజేపీకి 3418 ఓట్లు, కాంగ్రెస్‌కు 9046, బీఆర్ఎస్‌కు మాత్రం 1645 ఓట్లు వచ్చాయి.
- 14వ రౌండ్‌లో 8540 ఓట్లు ఉంటే బీజేపీకి 2407 ఓట్లు, కాంగ్రెస్‌కు 4554 ఓట్లు, బీఆర్ఎస్‌కు 1420 ఓట్లు వచ్చాయి.
- 15వ రౌండ్‌లో 11245 ఓట్లు ఉంటే బీజేపీకి 3337, కాంగ్రెస్‌కు 6497, బీఆర్ఎస్‌కు 1213 ఓట్లు పోలయ్యాయి.
- ఈ ఓట్లన్నీ అల్లాపూర్, బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందినవి కావడంతో ఓట్లు ఏకపక్షంగా కాంగ్రెస్‌కు పడినట్లు తెలుస్తోంది. అదే విధంగా హిందువులు, సెటిలర్లు ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి ఎక్కువగా ఓట్లు పోలయ్యాయి. మైనార్టీలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపడంతో బీఆర్ఎస్ ఘోరంగా దెబ్బతిన్నదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీకి సుమారు 80వేల ఓట్ల తేడా ఉంది. మూడో స్థానంలో బీఆర్ఎస్ చేరటం గమనార్హం.

విజేతలకు శుభాకాంక్షల వెల్లువ



ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మక్కాల నర్సింగ్‌రావు



కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నరేందర్‌రెడ్డి, రవీందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: మల్కాజిగిరి ఎంపీగా అత్యధిక మెజార్టీతో ఈటల రాజేందర్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఓల్డ్‌బోయిన్‌పల్లి బీజేపీ నేత మక్కాల నర్సింగ్‌రావు బుధవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ప్రతి నియోజకవర్గ ప్రజలు ఈటలను ఆదరించి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి..

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోకసభ ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, సురభి రవీందర్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ విజయానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



ఈటలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వద్దేపల్లి రాజేశ్వరరావు

పోలీస్ చట్టాల్లో మార్పులు రావటం శుభ పరిణామం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లేశం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మోతీనగర్: సమాజంలో శాంతి భద్రతలు కాపాడంటంలో ప్రతి ఒక్కరూ యూనిఫాం లేని పోలీసులేనని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం అన్నారు. జులై 1వ తేదీ నుంచి పోలీస్ చట్టం అమలు పరుచుతున్న సందర్భంగా బుధవారం లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ శాఖ ప్రతినిధులు కొత్త చట్టాలకు సంబంధించిన "భారతీయ నాగరి సురక్ష సంయుత, భారతీయ న్యాయ సంయుత, భారతీయ శిక్ష అభియనం" అనే మూడు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజలకు సులభంగా ఉండే పోలీస్ చట్టాల్లో మార్పులు రావటం శుభ పరిణామమని తెలిపారు. వ్యవస్థలోని మార్పును ఎప్పటికప్పుడు గమనిస్తూ పోలీస్ చట్టం ప్రజలకు సేవ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ రమేష్‌నాయుడు, ఎస్సై ఎంవీ రమణ, నాయకులు సత్యం గంగపుత్ర, మురళీ కృష్ణ, వి.శ్యాంసుందర్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రికి బెస్ట్ హాస్పిటల్ అవార్డు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రికి ఎక్స్‌లెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ పర్ఫార్మెన్స్ అవార్డును దక్కించుకుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ బోర్డు బుధవారం పర్యావరణ భవనంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. బెస్ట్ హాస్పిటల్ అవార్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణి ప్రసాద్ రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డా. కె.కమలాకర్, సీఈఓ డా. ఎస్.యోబుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ అవార్డు గ్రీన్ చాంపియన్ ఇన్ బయో మెడికల్ వర్క్ మేనేజ్‌మెంట్‌లో అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న డా. కమలాకర్, డా. యోబు తదితరులు

పర్యావరణ పరిరక్షణకు 10 కిలోమీటర్లు!



కొండాపూర్‌లోని పాలపిట్టపార్కులో ప్లకార్డులతో ప్రారంభిస్తున్న సైకిల్‌యాత్ర

రాయదుర్గం: కొండాపూర్‌లోని పాలపిట్టసైకిల్ పార్కులో 10 కిలోమీటర్ల సైకిల్‌యాత్రను బుధవారం సాయంత్రం నిర్వహించారు. పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకులు పత్రీజీ స్ఫూర్తితో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వసుధైక ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సహకారంతో ఈ యాత్రను నిర్వహించారు. వసుధైక ఫౌండేషన్ నిర్వాహకులు నాగేంద్రం పేరం జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న జీవహింసకు వ్యతిరేకంగా అహింసాయుత భూమాత సాక్షాత్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి అందరూ ప్రస్తుతం సైకిల్‌ను వాడేందుకు ఆసక్తి కనబర్చాలన్నారు. సైకిల్ తొక్కడంతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. అనంతరం ఉత్సాహంగా సైకిల్ రైడర్లు సైకిల్‌యాత్రలో పాల్గొన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి సంధ్య, హెచ్‌బీసీ మేనేజర్ శ్రావణ్ పలువురు సైకిల్ రైడర్లు ఉన్నారు.

మల్లయ్యకుంట చెరువులో అసంపూర్తిగా సుందరీకరణ పనులు



మోక్షమెప్పుడో?

ఎఫ్‌టీఎల్ ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్ను

హఫీజ్‌పేట్: చెరువులు, కుంటలను సుందరీకరణ పనులు ప్రత్యేక నిధులతో జీహెచ్ఎంసీ చేపడుతున్నారు. చందానగర్‌లోని పలు చెరువులు సుందరీకరణ దాదాపు పూర్తికావచ్చిన మరికొన్ని చెరువులను కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్లయ్యకుంట చెరువు చుట్టుపక్కల ఉన్న కాలనీలున్నాయి. వాటికి అందుబాటులో ఉన్న చెరువు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గతంలో కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. నామమాత్రంగా మల్లయ్యకుంటను అభివృద్ధి చేశారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి కుంట చుట్టూ కూడా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు ఎఫ్‌టీఎల్‌లోకి వస్తున్న స్థలాన్ని చదును చేసి ప్రహరీ నిర్మించుకుని కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తూ.. కబ్జాలకు యత్నిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరువు సుందరీకరణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు వద్ద చేపట్టాల్సిన పనులు..

- మల్లయ్య కుంట చెరువు అసంపూర్తిగా ఉన్న సుందరీకరణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి.
- చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యేక

పట్టించుకోని సంబంధిత అధికారులు

పైపులైన్ వెళ్లేలా చూడాలి

- అసంపూర్తిగా ఉన్న వాకింగ్‌ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టాలి.
- ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో సూచిక బోర్డును ఏర్పాటు చేయాలి.
- చెరువులో ఉన్న చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.
- రోజూ చెరువు సంరక్షణ కోసం సిబ్బందిని నియమించాలి.
- చెరువులో భవన నిర్మాణాల వ్యర్థాలు వేయకుండా చూడాలి. కట్టపై వృద్ధుల కోసం బెంచీలు ఏర్పాటు చేయాలి.
- చిన్నారులు, మహిళలకు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలలో బోర్డులు ఏర్పాటు చేసి కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

సుందరీకరణ పనులు ప్రారంభించాలి..



చందానగర్‌లోని మల్లయ్యకుంట చెరువులో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలి. కాలనీ వాసులకు అహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా అభివృద్ధి చేయాలి. – బ్రహ్మచారి, స్థానికుడు

ఎఫ్‌టీఎల్ స్థలాల్లో ప్రభుత్వ బోర్డులు పెట్టాలి..



మల్లయ్యకుంట చెరువు చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలు అక్రమార్కుల కన్ను పడింది. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిలో బోర్డులు పెట్టాలి. హుడాకాలనీకి ఆనుకుని ఉన్న మల్లయ్యకుంట చెరువు ఫెన్సింగ్ చుట్టూ ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నారు. కబ్జాదారులపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలి. – సుభాష్, స్థానికుడు



అసంపూర్తిగా వాకింగ్‌ట్రాక్



చెరువులోకి వచ్చి చేరుతున్న మురుగు

నేడు అమావాస్య ప్రత్యేక పూజలు

మోతీనగర్: వైశాఖ అమావాస్యను పురస్కరించుకొని కబీర్‌నగర్ శివరామాంజనేయ దేవాయలంలో లలితా పరమేశ్వరి అమ్మవారికి గురువారం ఉదయం 7గంటలకు అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 6గంటలకు నిమ్మకాయ దీపం పూజ, 9 గంటలకు కాలభైరవ స్వామికి భస్మాభిషేకం, కూష్మాండ దీపార్చన ఉంటుందన్నారు. ఈ అమావాస్య శని పుట్టిన రోజు కావటంతో కూష్మాండ దీపార్చన నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వయంగా పాల్గొని గోత్ర నామాలతో పూజలు చేయించుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలతో కార్పొరేటర్ శిరీష బాబూరావు

కూకట్‌పల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మలబార్ గోల్డ్ సంస్థ షోరూం హెడ్ ఎండీ ఇర్ఫాన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ శిరీషబాబూరావు విచ్చేసి కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం.5లోని పార్కులో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. భూతాపాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగమోహన్, నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ స్టార్ హెడ్ జైనుద్దీన్, మేనేజర్ శ్రీనివాస్‌రావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్లేస్‌మెంట్స్‌లో ఉత్తమ ప్యాకేజీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థిని చిన్మయికి సర్వీస్‌నౌ కంపెనీలో ఏడాదికి రూ.47 లక్షల ప్యాకేజీతో కూడిన ఉద్యోగం లభించింది. హెచ్‌సీయూ ప్లేస్‌మెంట్ చరిత్రలో ఇది ఇప్పటి వరకు అత్యధిక ప్యాకేజీ అని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్‌లో ఎంటెక్-ఐటీ గ్రాడ్యుయేట్ అయిన చిన్మయి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అన్నదానం

సుభాష్‌నగర్: సూరారం ప్రాంతానికి చెందిన చల్లా లక్ష్మీశ్రీనివాస్‌యాదవ్ తన కుమార్తె సంజన జన్మదినాన్ని పురస్కరించుకుని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. మీ కోసం ఫౌండేషన్ చైర్మన్ కట్టబోయిన శివయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు నల్లమల్ల కోటేశ్వరరావు, సభ్యులు స్రవంతి ట్రాఫిక్ పోలీస్ శ్రీ, చల్లా శ్రీనివాస్ యాదవ్, ఓంకార్, శశి కుమార్, నర్సింగ్, బత్తుల అయ్యప్ప, ఎండి షరీఫ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో పటిష్ట నిర్మాణాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు

'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: కాంక్రీట్ నిర్మాణాల్లో వస్తున్న నూతన సాంకేతిక విధానంతో పటిష్టమైన నిర్మాణాలు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ ఇన్ కాంక్రీట్ టెక్నాలజీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అనే అంశంపై బుధవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో విభిన్నమైన తరహాలో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దేవశ్రీ ఇస్పాత్ లిమిటెడ్ టెక్నికల్ మార్కెటింగ్ హెడ్ రాజీవ్‌సింగ్‌బిస్త్ మాట్లాడుతూ.. భారీ కాంక్రీట్ నిర్మాణాల వలన ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా ఆయా నిర్మాణాలు మరింత ఎక్కువ కాలం నిలబడేలా ప్రస్తుత నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. భవన నిర్మాణరంగంలో నూతన శాస్త్ర సాంకేతిక విధానాలు వస్తున్నాయన్నారు. ప్రతి నిర్మాణం ఎక్కువకాలం మన్నిక ఉండేలా నిర్మాణశైలిలో మార్పులను చేస్తున్నామన్నారు. సంస్థ ప్రతినిధులు ఎస్‌కే శర్మ, సీహెచ్.సంతోష్‌కుమార్, సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఫ్యాకల్టీ హెడ్ డాక్టర్ డి. ఆదినారాయణ, సీహెచ్. తిలక్, ఎల్. శ్వేత, ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, పలు సంస్థల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్'పై అవగాహన ర్యాలీ



మీదికుంట చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న ఫౌంటేన్ హెడ్ పాఠశాల విద్యార్థులు

హఫీజ్‌పేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఫౌంటేన్ హెడ్ గ్లోబల్ పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం మీదికుంట చెరువు, మాతృశ్రీనగర్‌లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంతో సంస్థ అధినేత్రి సుధారాణి కొయ్య నేతృత్వంలో విద్యార్థులతో కలిసి మౌనదీక్ష నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. అనంతరం విద్యార్థులు సేవ్ వాటర్ అండ్ నేచర్, ఓజోన్‌రన్ సహకారంతో మీదికుంట చెరువు వద్ద క్లీన్ అప్ డ్రైవ్‌లో విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. స్వాన్ వ్యవస్థాపకురాలు మేఘనా ముసునూరి మాట్లాడుతూ.. విద్యార్థులు నిబద్ధతతో స్ఫూర్తినిస్తూ.. పర్యావరణాన్ని కాపాడుకుంటున్న తీరు అద్భుతమన్నారు. ఫౌంటేన్ హెడ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులలో పర్యావరణ అవగాహన, బాధ్యతను పెంపొందిస్తున్నానన్నారు. సంపూర్ణ విద్య, సమాజం పట్ల నిబద్ధతను బలోపేతం చేయడం హర్షనీయమన్నారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా బొటానికల్ గార్డెన్

టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్

గచ్చిబౌలి: భవిష్యత్తులో చెట్ల పరిశోధన చేసేందుకు బొటానికల్ గార్డెన్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని టీఎస్ఎఫ్‌డీసీ ఏకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 50 అరుదైన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రంజిత్‌నాయక్ మాట్లాడుతూ.. బొటానికల్ గార్డెన్‌లో ఇప్పటి వరకు 1200 జాతుల మొక్కలు నాటమని, మొత్తం 1250 జాతుల మొక్కలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో బొటానికల్ గార్డెన్‌ను ప్రకృతి పర్యాటక, చెట్లమీద పరిశోధనకు అనుగుణంగా ఎడ్యుకేషనల్ హబ్ తీర్చిదిద్దుతామన్నారు. పరిశోధనకు 75 రకాల థీమ్‌లను సందర్శించే వారి కోసం బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. చెట్లు, ఆరోగ్యకరమైన నేల, స్వచ్ఛమైన నీటికోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్లు డీవీ.రెడ్డి, జీఎం డాక్టర్ సైదులాబ్, రవీందర్‌రెడ్డి, డీఎఫ్‌సీ కిరణ్‌కుమార్‌రెడ్డి, పీఓ పుష్పలత, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులున్నారు.



మొక్క నాటుతున్న రంజిత్‌నాయక్

నీట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు నీట్ పరీక్షలో ప్రతిభ చూపారు. దాదాపు 25 మందికి ఎంబీబీఎస్, ఐదుగురికి బీడీఎస్ సీట్లు లభించే విధంగా ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ కళాశాలలో ఇంటర్‌తోపాటు నీట్ ఎంట్రెన్స్ కోసం ఉత్తమ శిక్షణ ఇవ్వడంతో పేదింటి విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం లభిస్తోంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.గణేష్ మాట్లాడుతూ చేనేత, మున్సిపల్ కార్మికులు, సాధారణ కూలీల కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు నీట్‌లో ప్రతిభ చూపడం సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. సాధారణ విద్యతో పాటు నీట్, ఐఐటీ- జేఈఈ వంటి పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈసారి నీట్‌లో ఎం.రిశ్వంత్ 602 మార్కులు, సంజయ్ రామస్వామి 575, రోహిత్ 570, విశ్వతేజ 540, ఎస్ అజయ్‌కుమార్ 494, రితీష్ 488, కె భరత్ 475, జ్ఞానేశ్వర్ 464, జె.వెంకటేష్ 459, అజయ్ 459, సాయిచరణ్ తేజ 454, బి. అభిరామ్ 454, రోహిత్‌రావు 450 మార్కులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా 602 మార్కులు సాధించిన రిశ్వంత్ మాట్లాడుతూ మంచి కార్డియాలజిస్టు కావాలనేది తన కల అని చెప్పారు. మంచి డాక్టర్‌గా గుర్తింపు పొందాలనే కోరిక ఉందని మరో ర్యాంకర్ సంజయ్ రామస్వామి తెలిపారు.

టీహబ్‌ను సందర్శించిన ప్రముఖులు

రాయదుర్గం: టీహబ్ ప్రాంగణాన్ని దేశంలోని వారే కాకుండా విదేశాలకు చెందిన వారు కూడా నిత్యం సందర్శించడం ఆనవాయితీగా మారింది. దీనిలో భాగంగా ఒరికా సంస్థకు చెందిన బృందం, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అంగస్ మెల్‌బోర్న్, రీసెర్చ్ ఇన్నోవేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆడమ్ మూనీ కలిసి టీహబ్‌ను సందర్శించారు. ఈ మేరకు టీహబ్ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరస్పరం సహకారం విషయంలో రెండు సంస్థలు కలిసి పనిచేయాలని, టీహబ్-ఒరికా మధ్య సాంకేతిక ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఒరికా సంస్థ, టీహబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

మియాపూర్: మియాపూర్‌లోని 100, 101 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు యత్నించారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టాలిన్‌నగర్ కాలనీ సమీపంలో గత నాలుగు రోజులుగా మక్తమహబూబ్‌పేట, పీఏనగర్, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల బస్తీల మహిళలు గుడిసెలు వేసి ఆక్రమించేందుకు యత్నించగా.. విషయం తెలుసుకున్న హెచ్ఎండీఏ అధికారి గౌతం సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. దీంతో వారు అధికారులతో ఘర్షణకు దిగడంతో వారు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం కొంతమంది మహిళలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బుధవారం ఉదయం కూడా వారు అక్కడికి చేరుకుని గొడవకు దిగారు. సుమారు 500 ఎకరాల భూమి హెచ్ఎండీఏ అధికారుల పరిరక్షణలో ఉంది. గత కొన్నేళ్లుగా ఈ భూమి కోర్టు వివాదంలో ఉంది. అట్టి భూమిని ఎవరూ.. ఆక్రమించకూడదని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు చేస్తామని హెచ్ఎండీఏ అధికారులు హెచ్చరించారు.

ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయాలి

కాచిగూడ: తెలంగాణలో ఖాళీగా ఉన్న మంత్రి పదవులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ మహిళా జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మట్ట జయంతి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలో ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా కొన్ని ముఖ్యమైన శాఖలకు మంత్రులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

గచ్చిబౌలి: జీవితంలో ఎదగలేకపోతున్నానని చెప్పి ఓ యువకుడు అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, కాకినాడకు చెందిన ఎస్.అభివర్ధన్(28) ఉద్యోగం కోసం కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌కాలనీ సి-బ్లాక్‌లోని పర్ణిక శ్రీనిక ఎలైట్ ఫ్లాట్ నెంబర్ 501లో స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకెళ్లిన కొద్ది సేపటికి 'నేను జీవితంలో సక్సెస్ కాలేక పోయానని, అందుకే వెళ్లి పోతున్నాని' స్నేహితులకు మెసేజ్ చేశాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడం, కాకినాడకు వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జానీమాస్టర్‌పై ఫిర్యాదు

గచ్చిబౌలి: జానీ మాస్టర్‌పై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. తనను తెలుగు ఫిలిమ్ అండ్ టీవీ డ్యాన్సర్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జానీ మాస్టర్ వేధిస్తున్నారని, షూటింగ్‌లకు పిలవడం లేదని సతీష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. గత 4 నెలలుగా ఉపాధి లేకుండా ఇబ్బంది పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు షూటింగ్ చెప్పిన కో-ఆర్డినేటర్లు కూడా బెదిరింపులు ఫైన్‌లు విధించేలా చేస్తున్నారని ఆరోపించారు. జనరల్ బాడీ మీటింగ్‌లో సమస్యల మీద మాట్లాడినందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

నిద్రిస్తున్న వాచ్‌మెన్ పై నుంచి వెళ్లిన రెడీమిక్స్ వాహనం

అక్కడికక్కడే మృతి.. కేసు నమోదు

కుత్బుల్లాపూర్: నిర్మాణ భవనం వద్ద పడుకుని ఉన్న వాచ్‌మెన్ మీది నుంచి రెడీమిక్స్ వాహనం వెళ్లడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలో మైస్పేస్ నిర్మాణ సంస్థ చేపట్టిన బహుళ అంతుస్తుల భవనం వద్ద బిహార్ రాష్ట్రానికి చెందిన హరిరామ్‌సింగ్(40) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా బుధవారం భవనం వద్ద పడుకుని ఉండగా కాంక్రీట్ వేసేందుకు వచ్చిన రెడీమిక్స్ వాహన డ్రైవర్ వెనక్కి తీసే క్రమంలో హరిరామ్‌సింగ్‌ను గుర్తించకుండా అతడిపై నుంచి పోనిచ్చాడు. దీంతో వాహన రెండు టైర్లు అతడి మీది నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

జగద్గిరిగుట్ట: ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదేవి హిల్స్‌కు చెందిన మీరేష్‌గౌడ్, పావని(33)లు భార్యాభర్తలు. కాగా ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు మీరేష్‌గౌడ్ డ్యూటీకి వెళ్లగా పావని ఇంట్లో ఉంది. సాయంత్రం 7గంటలకు వీరి కుమారుడు విశ్వతేజ ఇంటికి వచ్చేసరికి తల్లి కనబడలేదు. అయితే మొబైల్ ఇంట్లో వదిలి వెళ్లిన పావని, మొబైల్ నుంచి తన చెల్లెలుకు వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పంపింది. అప్పుల బాధలు ఎక్కువవయ్యాయని అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని మెసేజ్‌లో తెలిపింది. దీంతో కుటుంబీకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.